క్లుప్తంగా

వసతి గృహంలో మెనూ అమలు కావడం లేదు

టెక్కలి: కళాశాలలు తెరుచుకుని విద్యార్థులంతా వసతి గృహాలకు చేరుకున్నప్పటికీ స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో గల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో మాత్రం మెనూ అమలు కావడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ నుంచి ఇంజినీరింగ్ స్థాయి వరకు ప్రస్తుతం సుమారు 35 మంది వరకు వసతి గృహానికి చేరుకున్నప్పటికీ, మెనూ ప్రకారం అందజేయాల్సిన భోజనాలు పెట్టడం లేదని చెబుతున్నారు. అంతే కాకుండా బుధవారం మధ్యాహ్నం పూర్తిగా భోజనాలు అందజేయలేదని వాపోయారు. తక్షణమే అధికారులు స్పందించి వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనాలు అందజేసే విధంగా చూడాలని విద్యార్థులంతా కోరుతున్నారు.

ప్లాస్టిక్ వినియోగం వద్దు


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

ఇచ్ఛాపురం: ప్లాస్టిక్ నివారణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక సీబీఎస్ఈ పాఠశాల జ్ఞానభారతి కార్యదర్శి జోహార్‌ఖాన్ అన్నారు. పాఠశాల ఆవరణలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా బహిష్కరిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పండా, హెచ్ఎం రషీదాసుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఆలీమ్‌ఖాన్ ఉన్నారు.

ఉత్సాహంగా మెకానిక్‌ల దినోత్సవం


కవిటిలో ర్యాలీ చేస్తున్న మెకానిక్‌లు

కవిటి: ప్రపంచ టూవీలర్ మెకానిక్స్ దినోత్సవాన్ని కవిటిలో చింతామణి టూవీలర్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహిచారు. ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. కేక్ కట్ చేసి సభ్యులంతా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ద్విచక్ర వాహనదారులకు మెరుగైన సేవలందిస్తామన్నారు. సంఘం అభివృద్ధిపై చర్చించారు. అనంతరం కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాల్లో ర్యాలీ నిర్వహించి సంఘం ఐక్యతను చాటి చెప్పారు.

పురుషోత్తపురంలో ఉచిత వైద్య శిబిరం


వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి 1, 2, వార్డుల్లోని పురుషోత్తపురంలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వారి సహకారంతో ఉచిత వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఒకటి, రెండు వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, చాట్ల పుష్ప శిబిరాన్ని ప్రారంభించారు. 150 మంది రోగులకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు చాట్ల తిరుపతి, కొణతాల రామ్మూర్తి, ఢిల్లీ, దానయ్య ఉన్నారు.

కమిషనర్‌గా ఓబులేసు బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) చల్ల ఓబులేసు బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కమిషనర్ ఓబులేసు మాట్లాడుతూ..నగరాన్ని మురుగునీటి ముప్పు నుంచి తప్పించేందుకు కృషి చేస్తానన్నారు. సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఏసీపీలు రమణమూర్తి, వరహాలబాబు, ఎంఈ గంగాధరరావు తదితరులున్నారు.

సొంత నిధులతో మెట్లు నిర్మాణం


మెట్లును ప్రారంభిస్తున్న వెంకటరమణ

సారవకోట: మండలంలోని గుమ్మపాడు పంచాయతీ అక్కివలస గ్రామానికి సమీపంలో వంశధార కాలువ వద్ద ఆ గ్రామానికి చెందిన హనుమంతు రామారావు తన సొంత నిధులు రూ.1.20 లక్షలతో మెట్లు నిర్మించారు. మాజీ సర్పంచ్, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ మెట్లును బుధవారం ప్రారంభించారు. గ్రామస్తులు స్నానం చేసేందుకు వీలుగా ఉండేలా మెట్లును నిర్మించినట్లు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు విలువ లేదా?

- మండల సమావేశంలో నిలదీసిన వైఎస్సార్‌సీపీ సభ్యులు
- సమన్వయంతో పనిచేయాలన్న ఎమ్మెల్సీ రామారావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ఇచ్ఛాపురం రూరల్:

కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినంత మాత్రాన ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను విస్మరించి ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సబబు అని సభ్యులు ప్రశ్నించారు. ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిజగింది. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నిరసనలు తెలియజేశారు. ఈదుపురం, కేశుపురం సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, గుజ్జు ఢిల్లీరావులు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం జూలై నెలలో పంపిణీ చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ప్రొటోకాల్‌ను పాటించకుండా అధికారులు టీడీపీ కార్యకర్తలచే పంపిణీ ప్రక్రియను చేపట్టడం సబబుగా లేదన్నారు. ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వరాదంటూ భారత రాజ్యాంగంలో ఏమైనా మార్పులు, చేర్పులు చేశారా అని ప్రశ్నించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ.. ఈ చర్యను ఖండిస్తున్నామని, ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు అయినటువంటి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొనే హక్కు ఉందన్నారు. పార్టీలకు కొమ్ము కాస్తూ అధికారులు వారిని విస్మరించడం తగదన్నారు. సమన్వయంతో అందరినీ కలుపుకుంటూ విధులు నిర్వహించాలని అధికారులను సూచించారు. ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమంతో పాటు జూలై 15 వరకు లెప్రసీ సర్వే నిర్వహిస్తున్నట్లు కొళిగాం పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ కాశ్యాణీ అన్నారు. ఆర్‌డబ్ల్యూస్ జేఈఈ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని చెప్పారు. మరో నెల రోజుల్లో అన్ని గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. ఈదుపురం సర్పంచ్ నర్తు ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది జూన్ నెలాఖరుకల్లా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలో సొమ్ము జమ చేసేవారన్నారు. ఇప్పుడు జూలై నెల ప్రారంభమైనప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అమ్మకు వందనం పథకాన్ని అమలు పరచడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. వ్యవసాయాధికారి టి.భార్గవి మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు, ఆరు రకాల విత్తనాలను రైతులకు అందజేసినట్లు చెప్పారు. సమావేశంలో జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, ఎంపీడీవో వై.వి.రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.


ప్రొటోకాల్‌పై అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ వరప్రసాద్

వెదకే రైతుల ప్రాధాన్యం

కాశీబుగ్గ: పలాస, మందస మండలాలతో పాటు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రైతులు ఈ ఏడాది వరిని వెద పద్ధతిలో సాగు చేసేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మందస మండలంలో 14 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు అవకాశం ఉండగా ఐదు వేల ఎకరాల్లో వెద పద్ధతినే రైతులు ఎంచుకున్నట్టు ఆ మండల వ్యవసాయ అధికారి నాగరాజు తెలిపారు. అలాగే పలాస మండలంలో 12 వేల ఎకరాలు ఉండగా సుమారు ఏడు వేల ఎకరాల్లో రైతులు వెద పద్ధతిలో వరిని సాగు చేస్తున్నారు. సాంబ, స్వర్ణ, 1061, 1064, ఆర్జిఎల్ 2537, 1224, 1121 విత్తనాలను రైతులు వినియోగిస్తున్నారు. నీటి వనరులు ఉన్నవారు వరినారు మడులను తయారు చేసే పనుల్లో బిజీగా ఉన్నారు.


చినంచలలో వెద సాగు కోసం పొలాన్ని దున్నుతున్న రైతులు

బోధన ముదింపునకే టీచ్‌టూల్

సోంపేట: ఉపాధ్యాయుని బోధనా పద్ధతిని ఒక నమూనాలో ముదింపు చేయడానికే టీచ్‌టూల్‌ను అభివృద్ధి చేసినట్లు సమగ్ర శిక్షా అకాడమిక్ మానిటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు జొరాడు, క్రిష్ణంరాజు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతన్న లక్ష్మీనారాయణ

ఘనంగా భారతీయ క్రైస్తవ దినోత్సవం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో భారతీయ క్రైస్తవ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి రోడ్‌లో ప్రత్తి అన్వేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. అనంతరం ఎటువంటి ఆదరణకు నోచుకోని పలువురికి దుప్పట్లు, దుస్తులు అందజేశారు. అలాగే క్రైస్తవుల అభ్యున్నతికి పాటుపడుతున్న పాస్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్ ప్రభుదాస్, బీమోబెహర, క్రిస్టియన్ పెద్దలు ప్రత్తి గోపాల్, వీరబాబు, ప్రకాశ్ పాల్గొన్నారు.


రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేస్తున్న దృశ్యం

విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలు


టెక్కలి మాట్లాడుతున్న ఫాలెన్ డేవిడ్

టెక్కలి: సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం విదేశాల్లో ఉన్నటువంటి ఉన్నత విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన లియో గ్లోబల్ ఓవర్‌సీస్ వ్యవస్థాపక డైరెక్టర్ ఫాలెన్ డేవిడ్ సూచించారు. విదేశీ విద్య అంశంపై బుధవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడా రు. యూకే, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా తదితర దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించడం వలన అత్యధిక వేతనాలతో ఉద్యోగవకాశాలు ఉన్నాయన్నారు. చదువులకు అవసరమైన ఆర్థిక సాయం సైతం అందజేయడానికి ఎన్నో బ్యాంకులు ముందుకు వస్తున్నాయని ఫాలెన్ డేవిడ్ తెలిపారు. ఈ సందర్భంగా విదేశాల్లో ఉన్నత విద్యకు సంబంధించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. గ్లోబల్ ఓవర్‌సీస్ సంస్థ పూర్తి బాధ్యతలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అడ్మిషన్ డైరెక్టర్ వాసవి, అసోసియేషన్ డీన్ డి.యుగంధర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డైరీల అందజేత


డైరీలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు కె.వెంకటరమణ డైరీలను వితరణ చేశారు. వీటిని ప్రధానోపాధ్యాయులు సుందర సాల్మన్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, ఎస్.నారాయణరావు, పి.చంద్రశేఖర్, ఆర్.చంటిబాబు, వై.తులసీదాస్, జ్యోత్స్న ఉన్నారు.

12న రెడ్‌క్రాస్ వార్షిక సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 12న ఉదయం 11 గంటలకు బాపూజీ కళామందిర్‌లో నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెడ్‌క్రాస్ సభ్యులు, పేట్రన్స్, వైస్ పేట్రన్స్, కమిటీ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. సమావేశంలో రెడ్‌క్రాస్‌కు విరాళాలు ఇచ్చిన దాతలకు, రక్తదాన శిబిరం నిర్వాహకులకు, నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు, సేవలందించిన రెడ్‌క్రాస్ వలంటీర్లకు అవార్డులను అందజేసి సన్మానిస్తామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం


అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ డైరెక్టర్ సింధు

ఆమదాలవలస: సైబర్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ రిజనల్ డైరెక్టర్ సింధు సూచించారు. మండలంలో పొన్నంపేట గ్రామంలో సీఎఫ్ఎల్ కో ఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు సమక్షంలో ఎస్ఎస్‌టీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఎవరైనా ఫోన్ చేసి ఏటీఎం పిన్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలను అడిగితే వివరాలు చెప్పవద్దని సూచించారు. బ్యాంక్ అధికారులు ఎవరికీ ఫోన్లు చేసి వివరాలు అడగరని తెలిపారు. నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి.ఎం.జె.జె.వై, పి.ఎం.ఎస్.బి.వై బీమా పథకాల గురించి వివరించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ టోల్ ఫ్రీ నంబర్ 14448కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సీసీ రామప్పడు, సీఎఫ్ గాయత్రి, గ్రామ పెద్దలు ఇప్పిలి సత్యం, కోటేశ్వరరావు, సూర్యారావు పాల్గొన్నారు.

శరవేగంగా కాలినడక వంతెన నిర్మాణం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి రైల్వే స్టేషన్‌కు ఆనుకుని ప్రయాణికుల సౌకర్యం కోసం నిర్మిస్తున్న కాలినడక వంతెన పనులు శరవేగంగా సాగుతున్నాయి. పక్కనే ఉన్న బ్రిటీష్ కాలం నాటి వంతెన శిథిలావస్థకు చేరుకుని ఊగిసలాడడంతో దానిని తాత్కాలికంగా మూసివేశారు. ప్రయాణికులు ఆందోళనకు దిగడంతో దానిని మళ్లీ తెరిచి దాని పక్కనే నూతన వంతెన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. సుమారు రూ. 4.36 కోట్లుతో పనులు జరుగుతున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు. ప్రధాన ఐరన్ పిల్లర్స్ ఎరక్షన్ పూర్తి చేయగా కాలినడక ర్యాంపులు వేసే పనులు త్వరలో చేపట్టనున్నారు. ఆగస్టు చివరి నాటికి వంతెన పనులు పూర్తియ్యే అవకాశాలున్నాయి.


కాలినడక వంతెన పనులు జరుగుతున్న దృశ్యం

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు

టెక్కలి: నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు చెప్పారు. టెక్కలి శాఖా గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయంలో పాఠకులకు, నిరుద్యోగ యువతకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. గ్రంథాలయాలకు సెస్ నిధులను చెల్లించే విషయంలో పంచాయతీ యంత్రాంగం చొరవ చూపాలన్నారు. డిప్యూటీ లైబ్రేరియన్ వి.శంకర్‌రావు, గ్రంథాలయాధికారి బి.రూపావతి ఉన్నారు.

మందస గ్రంథాలయం సందర్శన

కాశీబుగ్గ: మందస మండలం కేంద్రంలోని శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజా బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే పత్రికలు వివరాలపై ఆరా తీశారు. ఎంప్లాయిమెంట్ న్యూస్‌తో పాటు వార, పక్ష, మాస పత్రికలు, అన్ని దినపత్రికలు వచ్చేలా చూడాలని సిబ్బందికి సూచించారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య పెంచాలని అన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజు తదితరులు

ఓంకార్ మాస్టార్ కుటుంబానికి మాజీమంత్రి పరామర్శ


పరామర్శలో మాజీమంత్రి అప్పలరాజు తదితరులు

పలాస: పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయ ఉద్యమ నేత, సామాజిక కార్యకర్త బత్తిన ఓంకార్ మాస్టారు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం పరామర్శించారు. ఇటీవల ఓంకార్ గుండెపోటులో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న అప్పలరాజు వారి ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాపాక చిన్నారావు, బత్తిన హేమారావు, మాజీ సర్పంచ్ అప్పలస్వామి, కోరాడ లింగమూర్తి, బత్తిన మాధవరావు ఉన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు శిథిలం

టెక్కలి: టెక్కలిలోని మెళియాపుట్టి రోడ్‌లో వంశధార ఎడమ ప్రధాన కాలువ వంతెన రోడ్డు ఛిద్రంగా మారింది. ఈ ప్రాంతంలో పరిమితికి మించి భారీ లోడులతో గ్రానైట్ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఈ రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వంతెన వద్ద రోడ్డు దెబ్బ తినడంతో ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి భారీ లోడులతో రాకపోకలు సాగించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, స్థానికులు కోరుతున్నారు.


శిథిలమైన రోడ్డు

పిల్లలు కనిపిస్తే 1098కు కాల్ చేయండి

కాశీబుగ్గ: ఇంటి నుంచి పారిపోయి వచ్చిన పిల్లలు కనిపిస్తే 1098 నంబర్‌కు ఫోన్‌కాల్ చేసి సమాచారం అందించి వారిని కాపాడాలని పలాస చైల్డ్ హెల్ప్ డెస్క్ కో–ఆర్డినేటర్ జె.భాగ్యరెడ్డి అన్నారు. పలాస రైల్వేస్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై రైల్వే వెండార్స్‌కు బుధవారం అవగాహన కల్పించారు. బాలికలకు వివిధ రకాల మాయమాటలు చెప్పి తప్పుదోవ పట్టించడం, ప్రేమ పేరుతో వారికి తరలించే ప్రక్రియలు అత్యధికంగా జరుగుతున్నాయన్నారు. వీటిపై తక్షణమే చర్యలు చేపట్టాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆదేశాల మేరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రజలంతా బాధ్యతగా పిల్లలను కనిపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కోదండరావు, పీసీ జీవరత్నం ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది

మొక్కలను సంరక్షించాలి

ఎచ్చెర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు గట్లుపై నాటిన మొక్కలను బాధ్యతతో పెంచాలని ఏపీఓ శోభాదేవి అన్నారు. మండలంలోని ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువు గట్లుపై మొక్కలను నాటినంచి సంరక్షించేందుకు సంబంధించి నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు.

‘ఉపాధి’ బలోపేతమే సామాజిక తనిఖీ లక్ష్యం

కవిటి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయడమే సామాజిక తనిఖీ ప్రధాన లక్ష్యమని అధికారులు వెల్లడించారు. 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా రాజపురం, కొజ్జీరియా పంచాయతీల్లో సామాజిక తనిఖీ గ్రామసభలను బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా రాజపురం పంచాయతీలో రూ.75 లక్షల వేజ్‌పేమెంట్స్, రూ.33 లక్షల మెటీరియల్ పేమెంట్స్ చెల్లింపులకు సంబంధించి సామాజిక భద్రతా పెన్షన్ల చెల్లింపులపై తనిఖీలు నిర్వహించారు. గ్రామసభలో తనిఖీ వివరాల నివేదికపై చర్చించి మండల ప్రజావేదికకు నివేదిక సిద్ధంచేసి పంచాయతీ ఆమోదం తెలిపారు. కొజ్జీరియా పంచాయితీలో రూ.46.41 లక్షలు వేజ్‌కాంపోనెంట్స్,రూ.7.80 లక్షలు మెటీరియల్ కాంపోనెంట్స్‌కు సంబంధించి పనులు నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో నివేదికల్ని ప్రజల దృష్టికి తీసుకువచ్చి పంచాయితీ ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో టి.మోహనరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రాజపురంలో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

ఇసుక టిప్పర్ సీజ్

నరసన్నపేట: ఇసుకను అక్రమంగా విశాఖకు తరలిస్తున్న టిప్పర్‌ను నరసన్నపేట ఎస్ఈబీ ఎస్ఐ జానకీకావ్య పట్టుకుని సీజ్ చేశారు. జాతీయ రహదారిలోని సత్యవరం ఫ్లైఓవర్ పై ఇసుకతో ఉన్న టిప్పర్‌ను బుధవారం ఉదయం పట్టుకున్నారు. 18 టన్నుల బరువు ఉందని ఎస్ఐ తెలిపారు. ఎటువంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసి నరసన్నపేట పోలీసులకు అప్పగించామన్నారు. ఇసుక తవ్వకాలపై పూర్తి నిఘా పెట్టామన్నారు. కామేశ్వరిపేట, వెంకటాపురం, ముద్దాడపేటల్లో పర్యటించి సోదాలు చేశామన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే తెలియజేయాలని ఆయా గ్రామస్తులను కోరారు.


పట్టుబడిన ఇసుక టిప్పర్